ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 04 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# నాపై పెట్టిన కేసు కొట్టేయండి

**రాజకీయ కక్షతోనే ఇదంతా**

**అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలివ్వండి**

**హైకోర్టును ఆశ్రయించిన హరీశ్ రావు**

హైదరాబాద్ : పంజాగుట్ట పీఎస్లో తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని, నిరాధార చేసి, ఎటువంటి సంబంధం లేని కేసులో ఇరికించాలని యత్నిస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. కేసు కొట్టి వేయాలని, అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. డిసెంబరు 1న ఆయనపై పోలీసులు కేసు పెట్టారు. తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ పై సిద్దిపేటకు చెందిన చక్రధర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. మాజీ డీసీప రాధాకిషన్ రావుపై కేసు నమోదైంది.



# మూడు వారాల్లో కౌంటర్

**బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులకు భూకేటాయింపుల విచారణ**

**500 కోట్ల విలువైన భూమిని రూ.5 కోట్లకే కేటాయింపుపై వాదనలు**

**కేసీఆర్ తోపాటు ప్రభుత్వానికి సూచన**

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులకు భూ కేటాయింపులపై హైకోర్టులో విచారణ జరిగింది. హైదరాబాద్ తోపాటు జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీకి భూములు కేటాయించారన్నారు. 500 కోట్ల రూపాయల విలువైన భూమిని 5 కోట్లకు కేటాయించారని వాదనలు జరిగాయి. గజం 100 రూపాయలకే కేటాయించారని, కోర్టు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్. 2022 నుంచి కౌంటర్ దాఖలు చేయలేదని పిటిషనర్ తెలిపారు. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. మాజీ సీఎం కేసీఆర్ తోపాటు ప్రభుత్వానికి సూచన చేసింది.



# రూపం మారిస్తే చరిత్ర క్షమించదు

**తెలంగాణ తల్లి విగ్రహంపై కేటీఆర్ వ్యాఖ్యలు**

**నాడు ఇందిరాగాంధీ ప్రతిష్టించిన భారతమాత రూపాన్ని మార్చని వాజ్ పేయి**

**ఇప్పటికైనా ప్రయత్నం విరమించువాలని సీఎంకు విజ్ఞప్తి**

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్: మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయి అధికారంలోకి రాగానే మార్చలేదన్నారు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగిందన్నారు. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదన్నారు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదన్నారు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని సరి కాదని హితవుపలికారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తానన్నారు.. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయన్నారు. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదని కేటీఆర్ హెచ్చరించారు.



# థీమ్ పార్క్ కు సీఎం ప్రారంభోత్సవం

హైదరాబాద్: హైదరాబాద్ లో కోట్ల విజయభాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్ లో 'అద్భుతమైన వృక్ష పరిచయ క్షేత్రం' పేరిట థీమ్ పార్క్, వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. స్వయంగా వృక్ష పరిచయ క్షేత్రంలో ఎలక్ట్రికల్ వాహనంలో తిరిగి థీమ్ పార్కులు సందర్శించారు. అనంతరం అటవీ పర్యావరణహిత అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. నిర్వాహకులు ఎకో టూరిజం విధానాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. సందర్శకులు, విద్యార్థులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన పర్యావరణహిత వృక్ష పరిచయ క్షేత్రంలో 75 రకాల థీమ్ పార్కులు ఉన్నాయన్నారు. విద్యార్థులకు ప్రకృతి, జీవవైవిధ్య విజ్ఞానం అందించాలన్న లక్ష్యంతో థీమ్ పార్కులు ఏర్పాటు చేశామన్నారు. సంగీత పరికరాలు, ఆటవస్తువులు, ఏ చెట్ల నుంచి వస్తున్నాయో విద్యార్థులకు తెలపడం కోసం మ్యూజికల్ గార్డెన్ , స్పోర్ట్స్ గార్డెన్ వంటివి చేశామన్నారు. ఇలా ఒక్కొక్క థీమ్ తో ఒక్కో గార్డెన్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండ సురేఖతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్

**గూగుల్ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ చర్చ**

**టోక్యో తర్వాత ఇక్కడే..**

హైదరాబాద్ : తెలంగాణలో భారీ పెట్టుబడులకు గూగుల్ సిద్ధమైంది. ఆ మేరకు హైదరాబాద్‌లో సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి గూగుల్ ప్రతినిధులు చర్చించారు. ఆగస్టు 2024లో గూగుల్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు చర్చలు జరిపారని తెలుస్తోంది. కాగా గూగుల్ మేనేజ్‌మెంట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేలా ఒప్పించింది రేవంత్ సర్కార్. ఆసియా పసిఫిక్ రీజియన్‌లో టోక్యో తర్వాత హైదరాబాద్‌లోనే గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఉందని సీఎం రేవంత్ తెలిపారు.



# చెక్ పోస్టుల్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు చెక్‌పోస్టుల్లో 7 ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహించాయి. లెక్కలు చూపని నగదును ఏసీబీ బృందాలు సీజ్ చేశాయి. విష్ణుపురం చెక్‌పోస్టులో రూ. 86,500, భోరజ్(ఆదిలాబాద్) చెక్‌పోస్టులో రూ. 62,500, అలంపూర్ చెక్‌పోస్టులో రూ. 29,200 సీజ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ చెక్‌పోస్టుల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

# పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం రేపటికి వాయిదా

**సాంకేతిక లోపమే కారణం**

శ్రీహరికోట(ఆంధ్ర): శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి చేపట్టాల్సిన పీఎస్ఎల్వీ–సీ59 ప్రయోగం వాయిదా పడింది. కౌంట్‌డౌన్ ప్రక్రియ 25.30 గంటల పాటు కొనసాగిన తర్వాత బుధవారం సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీ–సీ59ను మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపాలని శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు. ఉపగ్రహంలో సాంకేతిక లోపం కారణంగా వాయిదా పడింది. గురువారం సాయంత్రం 4.12 గంటలకు పీఎస్ఎల్వీ–సీ59 నింగిలోకి పంపుతామని ఇస్రో ప్రకటించింది. యురోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా–3 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ–సీ59 ..కక్ష్యలోకి తీసుకెళ్లనుంది.

## ఇప్పుడు ఆ అవకాశం లేదని
# ఏడుస్తుండ్రు

**కాళేశ్వరం చుక్క నీరు లేకుండా రికార్డు స్థాయిలో పండిన వరి**

**ఇది కాంగ్రెస్ ఘనత**

**కడియం శ్రీహరి**



హైదరాబాద్ : ఈ ఏడాది కాళేశ్వరం నుంచి చుక్క నీరు లేకుండా రికార్డు స్థాయిలో పంట పండిందని కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి అన్నారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కావాలనే కాంగ్రెస్ ప్రజాపాలనపై విమర్శలు గుప్పిస్తుందన్నారు. కాళేశ్వరం నీరు లేకుండా 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణను దోచుకున్నారని, అనుచరులకు కూడా దోచిపెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు ఆ అవకాశం లేదని ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు.

# రాష్ట్రం అప్పుల కుప్ప

**ఈ ఘనత కేసీఆర్‌దే**

**మేం అధికారంలోకి వచ్చాక రూ. 67 వేల కోట్ల రుణ చెల్లింపులు చేశాం**

**త్వరలో రైతు భరోసా అందిస్తాం**

**మంత్రి జూపల్లి**



హైదరాబాద్ : రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మంత్రి జూపల్లి విమర్శించారు. రాష్ట్రంపై రూ.8 లక్షల కోట్ల అప్పులు మోపారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.67 వేల కోట్లు అప్పు కట్టిందన్నారు. కేసీఆర్ రూ.3వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. త్వరలోనే రైతు భరోసా కింద ఎకరానికి రూ.10వేలు అందిస్తామన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు.



# ఏసీబీకి చిక్కిన మార్కెటింగ్ శాఖాధికారి

నిర్మల్ : నిర్మల్ జిల్లాలో మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఏసీబీకి చిక్కారు. రూ. 7 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అధికారులు ఆయన్ను విచారిస్తున్నారు.

# నిశిత దృష్టితో అధ్యయనం

**ఇది రచయితలకు ఉండాలన్న వక్తలు**

**108 పాటలను రచించిన వెంకటకృష్ణ**

**ప్రపంచ రికార్డుల్లో చోటు**

హైదరాబాద్: ప్రముఖ రచయిత మాధవ వెంకట కృష్ణ నాలుగు ప్రపంచ రికార్డుల్లో చోటు సంపాదించుకున్నారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో షిరిడీ సాయి గాన యజ్ఞం, నాలో నేను అనే పుస్తకావిష్కరణ సభ ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కోవిడ్ క్లిష్ట సమయంలో షిర్డీసాయి గానయజ్ఞం పేరిట.. 108 పాటలను రచించిన వెంకటకృష్ణకు 4 ప్రపంచ రికార్డులను అందజేశారు. సాహిత్యానికి సామాజిక ప్రయోజనంతో పాటు మారుతున్న కాలానికి అనుగుణంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశిత దృష్టితో అధ్యయనం చేయటం రచయితకు ఉండాల్సిన ప్రధాన లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు.